క్లుప్తంగా

పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం

కడియం: కడియపుసావరం వైఎస్సార్ కాలనీలోని షేక్ సిలారిన్ సీయోను ప్రార్థనా మందిరంలో సోమవారం మండల పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ ఎం.కరుణాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ డి.పరంజ్యోతి, వైఎస్ ప్రెసిడెంట్ ప్రసన్న కుమార్ ప్రసంగించారు. సెక్రటరీ రత్నదీప్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జి.సత్యానందరావు వాక్యసందేశాన్నిచ్చారు. ఇటీవల అనారోగ్యానికి గురైన సభ్యులు పి.ప్రవీణ్‌కుమార్, పి.శామ్యూల్‌కు ఫెలోషిప్ తరఫున ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సోలోమన్, డి.రత్నరాజు, జీవరత్నం, విక్టర్ పాల్ పాల్గొన్నారు.

వైద్యశిబిరం

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి సాయినగర్‌లోని అపోలో ఫార్మసీలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. వేదస్పైన్ సెంటర్ వైద్యులు స్పైన్ సర్జన్ డాక్టర్ తేజోఫణీంద్ర, గైనకాలజిస్ట్ లక్ష్మీమృదుల వైద్య సేవలు అందించారు. శిబిరంలో బోన్‌డెన్సిటీ టెస్ట్, కొలెస్ట్రాల్, బీపీ, షుగరు పరీక్షలు నిర్వహించారు. 90 మంది వైద్య సేవలను వినియోగించుకున్నారు.

మరుగుదొడ్డి సౌకర్యం కల్పించాలి

రాజమహేంద్రవరం రూరల్: ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న పోలీసులకు కూడళ్లలో మరుగుదొడ్డి సౌకర్యం కల్పించాలని తూర్పురేఖ ఆర్‌టీఐ వ్యాప్తి వేదిక కన్వీనర్ దివిలి ప్రభాకరరావు అధికారులకు విన్నవించారు. సోమవారం రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యలు పరిష్కార వేదిక కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రమ్యకు వినతిపత్రం అందజేశారు. అలాగే ఎస్పీ పి.జగదీష్, ఎంపీడీవో డి.శ్రీనివాసరావులకు సైతం వినతిపత్రాలు అందజేసినట్టు తెలిపారు.

విద్యార్థులకు కిట్ల పంపిణీ

కడియం: మండల కేంద్రమైన కడియం హైస్కూల్ విద్యార్థులకు సోమవారం కిట్లు పంపిణీ చేశారు. ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై పంపిణీని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ మోసిగంటి సత్యవతి, ఉపసర్పంచ్ వెలుగుబంటి నాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే దుళ్ల హైస్కూల్ విద్యార్థులకు ఉపసర్పంచ్ తోకల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ గుర్రపు సత్యనారాయణ, వివిధ పార్టీ నాయకులు కిట్లను అందజేశారు.

పరిశుభ్రత అవసరం

రాజమహేంద్రవరం రూరల్: ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. శాటిలైట్‌సిటీ గ్రామంలోని ఏ బ్లాక్‌లో సోమవారం ఆయన స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైన్లలో పూడికతీతలతో పాటు, పిచ్చిమొక్కలను తొలగించారు. పంచాయతీ కార్యదర్శి టి.కృష్ణ, ఎంపీడీవో డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడి మృతికి సంతాపం


వీరభద్రం (ఫైల్)

కంబాలచెరువు: స్థానిక టౌన్ మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేసి, పదవీ విరమణ చేసిన వీరభద్రం మృతికి ఏపీటీఎఫ్ సంతాపం తెలిపింది. హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు హాస్పిటల్లో చికిత్స పొందుతూ వీరభద్రం తుదిశ్వాస విడిచారని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం ఉదయం పేపర్ మిల్లు సమీపంలోని వీరభద్రం స్వగృహం వద్ద పార్థివ దేహాన్ని ఉంచనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారన్నారు. అధ్యక్షుడు డేవిడ్ లివింగ్ స్టన్, రాష్ట్ర కార్యదర్శి ఎ.ఉదయ బ్రహ్మం, రాష్ట్ర మాజీ కార్యదర్శి పి.అప్పయ్యశాస్త్రి తదితరులు సంతాపం తెలిపారు.

ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలి


అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్

కంబాలచెరువు: ప్రజలు అందజేసిన ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలని పోలీసు సిబ్బందికి ఎస్పీ పి.జగదీష్ సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం (పీజీఆర్‌ఎస్)) కార్యక్రమాన్ని సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలివచ్చి 27 ఫిర్యాదులను అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (ఎడ్మిన్) ఎస్‌ఆర్ రాజశేఖర్‌రాజు పాల్గొన్నారు.

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా

సీతానగరం: గ్రామంలో డయేరియా నమోదైన ప్రాంతంలో పంచాయతీ అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని ప్రజలకు అందజేస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోండ్రపు ముత్యాలు మాట్లాడుతూ డయేరియా ప్రాంత ప్రజలకు నాలుగు ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నామన్నారు. పంచాయతీ వాటర్ ట్యాంక్‌లను శుభ్రపర్చడం జరిగినా కొన్ని రోజుల పాటు ట్యాంక్‌ల ద్వారా నీటిని అందిస్తామన్నారు. గ్రామంలో డ్రైనేజీ పూడికతీత పనులు చేశామన్నారు.


కోటగుమ్మం సెంటర్‌లో డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించిన మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్


కోటగుమ్మం సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రౌతు సూర్యప్రకాశరావు, డాక్టర్ గూడూరి శ్రీనివాస్


వైఎస్సార్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్

దేశానికే ఆదర్శం వైఎస్సార్

- మాజీ ఎంపీ భరత్‌రామ్
- ఘనంగా మహానేత జయంత్యుత్సవం

రాజమహేంద్రవరం సిటీ: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అందించిన సేవలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. మార్గాని ఎస్టేట్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహించారు. భరత్‌రామ్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కార్పొరేట్ వైద్యాన్ని పేదలకు అందుబాటులో తీసుకువచ్చిన మహానుభావుడు వైఎస్సార్ అన్నారు. పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, 108, ఉచిత గృహాలు వంటి సంచలనాత్మకమైన సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారన్నారు. అన్ని సామాజిక వర్గాలకు న్యాయం చేసిన ఘనత ఆయనకు దక్కుతుందన్నారు. అలాగే మోరంపూడి సెంటర్, లాలాచెరువు సెంటర్, బైపాస్ రోడ్డు, కోటగుమ్మం ప్రాంతాల్లో జరిగిన వైఎస్సార్ జయంత్యుత్సవాలలో ఆయన పాల్గొన్నారు.

ఆరోగ్య ప్రదాత

విద్య, వైద్యాన్ని పేదలకు అందుబాటులోకి తీసుకువచ్చిన మహనీయుడు, ఆరోగ్యశ్రీ ప్రదాత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని వైఎస్సార్ సీపీ పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. తిలక్ రోడ్డులోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి అవసరమైన సంక్షేమ పథకాలను వైఎస్సార్ అమలు చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ డాక్టర్ వైఎస్సార్ అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయాయన్నారు. అనంతరం కోటగుమ్మం సెంటర్, మార్గాని ఎస్టేట్‌లో జరిగిన కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఉభయ రాష్ట్రాల బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, ఏపీ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ స్టేట్ మాజీ డైరెక్టర్ కానుబోయిన సాగర్, మాజీ కార్పొరేటర్లు గూడూరి రాధిక, మానే దొరబాబు, వాకచర్ల కృష్ణ, మజ్జి నూకరత్నం, పెంకే బాపన సుధారాణి, కోడికోట, మజ్జి అప్పారావు, కాటం రజనీ కాంత్, అడపా అనిల్, పెంకె సురేష్ తదితరులు పాల్గొన్నారు. కోటగుమ్మం సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ పుష్పాంజలి ఘటించారు.


హుకుంపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వైఎస్సార్ జయంతి నిర్వహిస్తున్న ఆకుల వీర్రాజు


ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి నివాళి

పేదల జీవితాల్లో వెలుగులు

పేదల జీవితాలలో వెలుగులు నింపిన మహానుభావుడు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు, పీసీసీ సభ్యుడు బాలేపల్లి మురళీధర్ అన్నారు. కృష్ణా నగర్‌లోని పార్టీ కార్యాలయంలో సోమవారం వైఎస్సార్ జయంతి నిర్వహించారు.


జేగురుపాడులో వైఎస్సార్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న సతీష్‌చంద్ర స్టాలిన్

చిరస్మరణీయుడు

రాజమహేంద్రవరం రూరల్: ఆరోగ్యశ్రీ, ఫీజురీయింబర్స్‌మెంట్, 108 తదితర సంక్షేమ పథకాలను అమలు చేయడం ద్వారా పేదల గుండెల్లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చిరస్థాయిగా నిలిచిపోయారని డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు కొనియాడారు. హుకుంపేటలోని తన కార్యాలయంలో సోమవారం వైఎస్సార్ జయంతిని నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేశారు. పేదలు, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ముందుగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ముద్దాల అను, హితకారిణి సమాజం మాజీ డైరెక్టర్ దేవులపల్లి సరితారాణి, పార్టీ సాంస్కృతిక విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ నాగులపల్లి ఆశ, మాజీ ఉప సర్పంచ్ దాకే శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీలు సాధనాల శివ, కందిరెళ్ల సత్తిబాబు, మాజీ సొసైటీ చైర్‌పర్సన్ కురుమళ్ల ఆంజనేయులు, కడియం మండల జేసీఎస్ కన్వీనర్ తాడాల చక్రవర్తి, కేవీ సుబ్బారెడ్డి, బోడపాటి సత్యనారాయణ, డాక్టర్ సత్యగిరి, సద్గుణ రామారెడ్డి, పిన్నమరెడ్డి సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

బొమ్మూరులో...

బొమ్మూరు వైఎస్సార్ సెంటర్‌లో ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి ఘనంగా నిర్వహించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు, కడియం మండల జేసీఎస్ కన్వీనర్ తాడాల చక్రవర్తి, వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ముద్దాల అను కేక్ కట్ చేసి వివిధ ప్రతిభావంతులకు పంచిపెట్టారు. పార్టీ నాయకులు, యూనియన్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే బొమ్మూరు పాతపేటలో పార్టీ యువ నాయకులు అప్పా రాజీవ్ కుమార్ (బాబీ), తోడేటి రాహుల్ మిత్ర బృందం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

జన హృదయ నేత

ధవళేశ్వరం: దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ జన హృదయ నేత అని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. పోలీస్ స్టేషన్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద జయంతిని ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం నిరంతరం పరితపించిన నాయకుడు వైఎస్సార్ అన్నారు. కార్యక్రమంలో సాధనాల చంద్రశేఖర్ (శివ), బొడపాటి కుమార్, డాక్టర్ చొల్లంగి సత్యగిరి, దేవులపల్లి సరితారాణి, ముత్యాల పోసికుమార్, బర్రి కామేశ్వరరావు, పేర్ల బాసి, గునిపె అశోక్, పుట్టా పరేష్‌నాథ్, కరకు ఇమ్మానియేల్, ముత్యాల జాన్, ఎల్‌వీ ప్రసాద్, నంబూరి రవి, గూటం రాజు, మేకా అంజి తదితరులు పాల్గొన్నారు.

సేవలు మరువలేం

కడియం: బడుగు, బలహీన వర్గాలకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేసిన మేలును మరువలేమని వక్తలు పేర్కొన్నారు. ఆయన జయంతిని పురస్కరించుకుని కడియం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన విగ్రహాలకు పార్టీ నాయకులు, వైఎస్సార్ అభిమానులు పుష్పాంజలి ఘటించారు. జేగురుపాడులో పార్టీ మండల అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆకుల సుధాకర్, మాజీ ఎంపీటీసీ నాగిరెడ్డి వీరశివాజీ, పుల్లా బుజ్జి, సాక కిరణ్‌కుమార్, బళ్ల అన్నవరం, మోటిక మునియ్య, మద్దుకూరి గోపి, వరసాల జగన్ పాల్గొన్నారు.


కడియంలో గిరజాల బాబు ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంత్యుత్సవం

సంక్షేమ సారథి

సంక్షేమ పథకాలతో ప్రజా జీవితాలను అభివృద్ధి వైపు నడిపించిన ఘనత వైఎస్సార్‌కు దక్కుతుందని వైఎస్సార్ సీపీ నాయకుడు గిరజాల వీర్రాజు (బాబు) అన్నారు. కడియంలో సోమవారం ఆయన వైఎస్సార్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దాసరి శేషగిరి, పార్టీ నాయకులు ఆకుల సుధాకర్, ఆరేటి వెంకట్రావు, పిండి మూర్తి, ఆర్‌ఎస్‌ఎస్ మూర్తి, దాసరి నాగేంద్ర, మహిచర్ల శ్రీనివాస్, గుత్తుల వాసు, లావేటి రమేష్, బండారు శ్రీనివాసరావు, అవిరెడ్డి వెంకటేశ్వరరావు, మత్సేటి రాజు తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాలలో..

కడియపులంకలో జాతీయ రహదారి సమీపంలోని వైఎస్సార్ విగ్రహానికి పార్టీ నాయకులు బోడపాటి సత్యనారాయణ, తిరుమలశెట్టి శ్రీను తదితరులు పుష్పాంజలి ఘటించారు. బుర్రిలంకలో తాడాల విష్ణుచక్రవర్తి, కొత్తపల్లి శివాజీ, గాద రామకృష్ణ, ఈలి సత్తిబాబు తదితరులు వైఎస్సార్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. దోసాలమ్మ కాలనీ వద్ద పార్టీ నాయకులు ఈలి గోపాలరావు ఆధ్వర్యంలో పూలమాలలు వేశారు. వీరవరంలో వైఎస్సార్ విగ్రహానికి పార్టీ నాయకులు పూలమాలలు వేశారు. దొంతంశెట్టి చిన వీరభద్రయ్య, రేమళ్ల ప్రసాద్, రేమళ్ల హరీష్‌బాబు, లంక కనకయ్య, బచ్చు రామకృష్ణారావు పాల్గొన్నారు. వేమగిరి జంక్షన్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పితాని శ్రీను, మెళ్ళం భాస్కరరావు, కాశీ, నవీన్, శ్రీను, గవర మోహనరావు నివాళులర్పించారు.

127వ సారి రక్తదానం చేసిన డాక్టర్ బాబు


కోరుకొండలో రక్తదానం చేస్తున్న డాక్టర్ బాబు

సీతానగరం: గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి రమేష్ బాబు (డాక్టర్‌బాబు) 127వ సారి రక్తదానం చేశారు. కోరుకొండ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆధ్వర్యంలో సోమవారం వైఎస్సార్ జయంతి సందర్భంగా నిర్వహించిన శిబిరంలో డాక్టర్ బాబు 127వ సారి రక్తదానం చేశారు. 1998లో డాక్టర్ బాబు ఫ్రెండ్స్ సర్కిల్ – మదర్ థెరిస్సా సేవా సమితిని నెలకొల్పారు. దీనిలో వెయ్యిమంది సభ్యులు ఉన్నారు. ఇప్పటికి 24,800 మంది రోగులకు రక్తదానం చేశారు. ఆయన 2008, 2009, 2010, 2019, 2024 లలో జిల్లా కలెక్టర్ల చేతుల మీదుగా పలు అవార్డులను అందుకున్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు


సమావేశంలో పాల్గొన్న స్పెషల్ ఆఫీసర్ సాయిబాబా తదితరులు

సీతానగరం: మండలంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ పి.సాయిబాబా అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలని, డ్రైనేజీ వ్యవస్థపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, సురక్షిత తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గర్భిణులు, శిశువులకు సమయానికి టీకాలు వేయాలని, పౌష్టికాహారం తీసుకునేలా చూడాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో కృష్ణ చైతన్య, పీహెచ్‌సీ డాక్టర్ ఏవీకే చైతన్య, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రవికుమార్, ఈవోపీఆర్డీ మూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వి.అవినాష్ పాల్గొన్నారు.

గోదావరి ప్రక్షాళనకు సమష్టిగా కృషి చేద్దాం

- విశ్వేశ్వరరెడ్డి ఉద్యమం అభినందనీయం
- మంత్రి కందుల దుర్గేష్


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్

రాజమహేంద్రవరం సిటీ: గోదావరిని కాలుష్య కోరల నుంచి కాపాడుకునేందుకు మనమంతా కృషి చేయాలని, దానికి మంత్రిగా సహాయ సహకారాలు అందిస్తానని ఏపీ పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. పుష్కర ఘాట్‌లో సోమవారం గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో సమితి వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ గోదావరిని కాపాడటానికి టీకే విశ్వేశ్వరరెడ్డి చేపట్టిన ఉద్యమాలు అభినందనీయమన్నారు. రాజకీయాలకు అతీతంగా అందరూ మద్దతు ఇవ్వడం ద్వారా జల కాలుష్య ఉద్యమం జనం గొంతుకగా మారిందన్నారు. గోదావరి జలాలు కలుషితం కాకుండా ఉండేందుకు వీలుగా తాము ప్రభుత్వం తరఫున ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. అనంతరం గోదావరి పరిరక్షణ ఉద్యమాలపై రూపొందించిన జల ఉద్యమ నేత జన చైతన్య ప్రదాత అని పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ కర్రి రామారెడ్డి మాట్లాడుతూ ప్రజలు తమ ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ విశ్వేశ్వరరెడ్డి పోరాటాలు అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా యాచకులకు 200 రగ్గులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పార్లమెంట్ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, డీఎంఆర్ శేఖర్, కానుబోయిన సాగర్, అనుశ్రీ సత్యనారాయణ, ఆదిత్య గంగిరెడ్డి, చల్లా సత్యవాణి, కేకే సంజీవరావు, బాక్స్ ప్రసాద్, సప్పా ఆదినారాయణ, దేశిరెడ్డి బలరామ నాయుడు, జిత్ మోహన్ మిత్ర పాల్గొన్నారు.

పరిశోధనలకు ఆర్థిక సహాయం

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ అటానమస్ కళాశాలలో వివిధ విభాగాలలో పరిశోధనలు చేసే అధ్యాపకులకు ఆర్థిక ప్రోత్సాహకాలను అందిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు తెలిపారు. కళాశాలలో పరిశోధనల కోసం ప్రత్యేకంగా అంతర్గత నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. పరిశోధన స్టీరింగ్ కమిటీ ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహించి, 13 మంది అధ్యాపకులను వివిధ విభాగాల నుంచి ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరు ఏడాదిన్నరలో ప్రాజెక్టును పూర్తి చేసేలా వ్యవధి ఇచ్చి, తగిన ఆర్థిక సహాయం కూడా అందజేస్తున్నామన్నారు. దాన్ని కళాశాల అంతర్గత నిధుల నుంచి సమీకరిస్తున్నామన్నారు. రసాయన శాస్త్రంలో నాలుగు, భౌతిక శాస్త్రంలో మూడు, వాణిజ్య శాస్త్రంలో రెండు, వృక్ష శాస్త్రంలో ఒకటి, అర్థశాస్త్రంలో ఒకటి, మ్యాథమెటిక్స్‌లో ఒకటి, ఆంగ్లంలో ఒక పరిశోధనలను మంజూరు చేసినట్లు వివరించారు. గత ఏడాది ఆరు ప్రాజెక్టులను మంజూరు చేశామని, ఐసీఎస్ఎస్ఆర్ ద్వారా ఒక జాతీయ ప్రాజెక్టును తెలుగుశాఖ సాధించినట్లు, రుసా ఐదు ప్రాజెక్టులను కళాశాలకు కేటాయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాపకులు ఉత్తమ పరిశోధనలు చేసి కళాశాలకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. వారందరికీ చెక్కులను అందజేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల పరిశోధనా విభాగ సమన్వయకర్త డాక్టర్ ఈసుబ్ బాషా షేక్, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ అన్నపూర్ణ, ప్రాజెక్టు గ్రహీతలు పాల్గొన్నారు.

వారం రోజుల్లో పారిశుధ్యం మెరుగుపర్చాలి

- కలెక్టర్ ప్రశాంతి
- ధవళేశ్వరంలో పర్యటన


ధవళేశ్వరంలో పర్యటిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి

ధవళేశ్వరం: పారిశుధ్య నిర్వహణను వారం రోజులలో గాడిన పెట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, మండల స్థాయి అధికారులతో కలిసి సోమవారం ధవళేశ్వరంలో పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీ అధికారులు శానిటేషన్ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుని, శానిటేషన్ సిబ్బంది సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలన్నారు. సుమారు 140 మందికి పైగా సిబ్బంది ఉన్నా పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వహించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శానిటేషన్ సిబ్బంది హాజరు వివరాలతో కూడిన నివేదిక అందజేయాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు. పంచాయతీ పరిధిలోని మురుగునీటి కాలువలపై ఆక్రమణలను గుర్తించారు. వాటిని ఇంటి యజమానులు స్వచ్ఛందంగా తొలగించేలాగా ప్రచారం చేపట్టాలన్నారు. ధవళేశ్వరంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు, రూరల్ ఎంపీడీవో డి శ్రీనివాస్, మండల స్పెషల్ ఆఫీసర్ కేఎన్ జ్యోతి పాల్గొన్నారు.

బాలికల వసతి గృహం తనిఖీ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక గణేష్ చౌక్‌లోని బాలికల సంక్షేమ వసతి గృహాన్ని కలెక్టర్ పి.ప్రశాంతి సోమవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ వార్డెన్, ఇతర సహాయక సిబ్బంది సేవలపై బాలికల నుంచి సమాచారం తెలుసుకున్నారు. స్టడీ అవర్, మరుగుదొడ్ల నిర్వహణ, లైటింగ్ తదితర అంశాలపై ఆరా తీశారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో చక్కటి వసతులు కల్పించారని, వాటిని సద్వినియోగం చేసుకుని బాగా చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. కలెక్టర్ వెంట జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ఎం.సందీప్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి పి.సత్య రమేష్ ఉన్నారు.

సినిమాలు



శ్యామల	:	ఆ ఒక్కటీ అడక్కు
అనుశ్రీ సినిమాస్	:	ఓఎంజీ (ఓ మంచి ఘోస్ట్)
సూర్యప్యాలెస్	:	దేస్పికేబుల్‌మి 4
సూర్యమినీ	:	కల్కి
స్వామి	:	మహారాజ
అశోక	:	కల్కి
రాజా	:	కల్కి
శివజ్యోతి	:	మనమే
రంభ	:	14
ఊర్వశి	:	భారతీయుడు
మేనక	:	బాక్
అప్సర	:	కల్కి
కుమారి	:	హరోంహర, కల్కి (3 షోలు)
నామవరం		
వీఎస్ మహల్	:	కల్కి
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	కల్కి
కడియం		
వెంకటసూర్య	:	కల్కి

'నన్నయ'పై తప్పనిసరిగా విచారణ జరగాలి

- 2014 నుంచి 24 వరకూ ప్రతి అంశాన్ని పరిశీలించాలి
- మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా


విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో జరిగిన అవకతవకలపై తప్పనిసరిగా విచారణ జరిపించాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. యూనివర్సిటీలో గత ఐదేళ్లలో కాంట్రాక్టులు, నిర్మాణాలు, నియామకాలలో భారీగా అవినీతి జరిగిందని, సీబీసీఐడీతో విచారణ జరిపిస్తామని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ చేసిన ఆరోపణలపై జక్కంపూడి స్పందించారు. దమ్ముంటే 2014 నుంచి 2024 వరకు యూనివర్సిటీలో జరిగిన ప్రతి అంశం పై విచారణ జరిపించాలని సవాల్ చేశారు. లేకుంటే బత్తుల చేసిన ఆరోపణలు ఆర్భాటం కోసం చేసినట్టుగా ఉంటాయన్నారు. కోరుకొండలో సోమవారం దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిలో పాల్గొన్న జక్కంపూడి రాజా.. అనంతరం మీడియాతో మాట్లాడారు. దివంగత నేతలు వైఎస్సార్, జక్కంపూడి రామ్మోహనరావుల ఆలోచనలతో ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఏర్పడిందన్నారు. ఆ తరువాత రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చే వరకు ఈ యూనివర్సిటీ అభివృద్ధి గురించి పట్టించుకున్న పాలకులు, నాయకులు లేరన్నారు. గడచిన ఐదేళ్లలో డిపార్టుమెంట్ల చుట్టూ తిరిగి యూనివర్సిటీ అభివృద్ధికి అవసరమైన నిధులను మంజూరు చేయించామని గుర్తు చేస్తూ, అందుకు సంబంధించిన ఫైళ్లు తన వద్ద ఉన్నాయన్నారు. నిధులు మంజూరులో జాప్యం జరిగితే యూనివర్సిటీలోని అంతర్గత నిధులను ఉపయోగించి, పనులు పూర్తి చేయించడానికి అనుమతులు కోరామన్నారు. ఈ విధంగానే యూనివర్సిటీలో పలు భవన నిర్మాణాలు జరిగాయని వివరించారు. అయితే సార్వత్రిక ఎన్నికలలో పడి చివరి ఆరు మాసాలు యూనివర్సిటీ ప్రగతిపై దృష్టి పెట్టలేకపోయమన్నారు.

20 వేల దొంగ ఓట్లు ఏమయ్యాయి

ఎన్నికల సమయంలో నియోజకవర్గంలో 20 వేల దొంగ ఓట్లు ఉన్నాయంటూ చేసిన ఆరోపణ ఏమైందని ప్రస్తుత ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణను మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ప్రశ్నించారు. 20 వేలు కాదుకదా కనీసం రెండు వేల దొంగ ఓట్లను కూడా అధికారులుగాని, ఎన్నికల సంఘంగాని ధ్రువీకరించలేదన్నారు. ఎటువంటి ఆధారాలు లేకుండా ఆరోపణలు చేసి, ఎదుటి వారిపై బురద చల్లి పబ్బం గడుపుకోవడం బత్తులకు అలవాటేనన్నారు.

ఉద్యోగాల పేరుతో వసూలు

వివిధ సంస్థలలో ఉద్యోగాలు వేయిస్తానంటూ నిరుద్యోగుల నుంచి లక్షల కొద్ది వసూలు చేసి, ఉద్యోగాలు అమ్ముకున్న వ్యక్తి, నేడు తనపై విమర్శలు చేయడం వింతగా ఉందని జక్కంపూడి రాజా అన్నారు. కొత్తగా ఎన్నికైన ప్రభుత్వానికి, పాలకులకు ఏడాది పాటు సమయం ఇవ్వాలని ఓర్పుతో ఉన్నామన్నారు. లేనిపోని ఆరోపణలు చేస్తే తగిన సమాధానం చెబుతామని హెచ్చరించారు.